క్లుప్తంగా

మస్తాన్ వలికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



దాచేపల్లి: మండలంలోని తంగెడ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్‌వలి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. మ్యాథ్స్ ఉపాధ్యాయుడిగా రాణిస్తూ.. సేవ, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన విశిష్ట సేవలందించారు. మస్తాన్‌వలి సేవలను నార్త్ అమెరికా తెలుగు సొసైటీ గుర్తించి, ఈ అవార్డు ప్రదానం చేసింది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సొసైటీ ప్రెసిడెంట్ నూతి బాపయ్య చేతుల మీదుగా ఈ అవార్డును గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అందుకున్నారు. మస్తాన్ వలిని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టిపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగెండ్ల ఏసయ్య, తగరం ఆనంద్‌కుమార్, శంకరశెట్టి వెంకటేశ్వర్లు అభినందించారు.

ఆదర్శపాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దాచేపల్లి : స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎస్.రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో పాఠశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని, 7న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

మాచవరం: రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు ఏవో కె.రామమ్మ శనివారం తెలిపారు. అన్ని విత్తనాలు 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జనుము 10 కేజీలు సంచి పూర్తి ఖరీదు రూ.880 కాగా, సబ్సిడీపై రూ.440 ఇవ్వనున్నట్లు తెలిపారు. పిల్లిపెసర 8 కేజీల బ్యాగ్ రూ.536, జీలుగలు 10 కేజీల బ్యాగ్ రూ.440లకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్ కాపీలు ఆయా గ్రామాల్లోని గ్రామ వ్యవసాయాధికారులకు అందజేయాలని సూచించారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దుర్గి: స్థానిక దుర్గి మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి 7, 9 తరగతుల మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బాలస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోపు మోడల్ స్కూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఊరేగింపులు, ర్యాలీలు నిషేధం

దాచేపల్లి : ఎన్నికల ఫలితాల నేపథ్యంలో 144 సెక్షన్ పకడ్బందిగా అమలు చేయనున్నట్లు సీఐ ఎ.సురేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం దాచేపల్లి పట్టణంలో పర్యటించారు. దుకాణాలు తెరకూడదని, మద్యం అమ్మకాలు జరపటం పూర్తిగా నిలిపివేసినట్లు చెప్పారు. ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాల తర్వాత ఊరేగింపులు, ర్యాలీలు, సంబరాలు జరుపుకునేందుకు అనుమతులు లేవని, బాణ సంచా కూడా పేల్చవద్దని స్పష్టం చేశారు. ప్రజలంతా ప్రశాంతంగా ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి తదితరులున్నారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

యడ్లపాడు: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ప్రకటించిన 144వ సెక్షన్ మండలంలో శనివారం ఉదయం నుంచి పోలీసులు అమలు చేశారు. శాంతి భద్రతల దృష్ట్యా అన్ని రంగాలకు చెందిన వ్యాపార, సేవా సంస్థలు మూసివేయాలని మైకు ప్రచారం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గేటు సమీపంలోని మురుగు కాల్వలో ఓ మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని కాల్వలో నుంచి బయటకు తీయించారు. వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటాయని గుర్తించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 8688831336కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

హోటల్ యజమానిపై కేసు నమోదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా బాలురతో పని చేయిస్తున్న హోటల్ యజమానిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైల్డ్ రైట్స్ ఫౌండేషన్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం నగరంలో దాడులు నిర్వహించారు. ఆర్.అగ్రహారంలోని అరుణ బిర్యాని పాయింట్‌లో ఇద్దరు బాల కార్మికులను గుర్తించారు. వారిని చైల్డ్ లైన్ అధికారులు వసతి గృహానికి పంపి, యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



ఆంజనేయ స్వామి మూలవిరాట్‌కు పూజలు



జెట్టిపాలెంలో ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి



కారెంపూడిలో మిట్టమీద ఆంజనేయ స్వామి



పిడుగురాళ్లలో మహా అన్నదానం

రెంటచింతల: హనుమజ్జయంతి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి కాలనీలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో అర్చకులు అనిల్ శర్మ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, జెట్టిపాలెం, గోలి, మల్లవరం, పాలువాయిగేటు, పాలువాయి, తుమ్మకోట, రెంటాల గ్రామాల్లోని ఆలయాల్లో ఘనంగా జయంతి వేడుకలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి ఆశీస్సులను పొందారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ఆంజనేయస్వామి జయంతి

వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో వీరాంజనేయ స్వామి జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు యండపల్లి సుబ్బారావు, శ్రీహరి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగర సంకీర్తన, గణపతి పూజ, పుణ్యాహవచనం, పుల్లాభట్ల జగన్నాథ శర్మ మెమోరియల్ ట్రస్టు ద్వారా 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం, నాగవల్లీ దళ సహస్ర నామార్చన, మన్యసూక్త పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కారెంపూడిలో ..

కారెంపూడి: ఒప్పిచర్ల చారిత్రక ప్రసిద్ధి చెందిన పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు విశ్వనాథం శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. చినగార్లపాడు గ్రామంలో ప్రత్యేక హోమం చేపట్టారు. స్వామికి తమలపాకుల సేవ, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కాసులనాటి శివశంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కారెంపూడి సెంటర్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయం, మిట్టమీద ఆంజనేయస్వామి దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు.

ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద హనుమజ్జయంతిని పురస్కరించుకొని స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డు సమీపంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సువర్చల, ఆంజనేయస్వామి వారి కల్యాణం నిర్వహించారు. పుణ్యదంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని, స్వామి ఆశీస్సులను పొందారు. మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు



అఖిలపక్ష సమావేశంలో తహసీల్దారు చంద్రశేఖర్

వెల్దుర్తి: మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని తహసీల్దారు చంద్రశేఖర్ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల మద్దతుదారులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీలతో పాటు గ్రామ స్థాయి నాయకులను ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మంగళవారం శాంతిభద్రతల విషయంలో సహకరించాలని కోరారు. 5వ తేదీ వరకు గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని, గుంపులుగా తిరగకూడదన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని స్పష్టం చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

మాచవరం: ఈ నెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లు జరగకుండా ఉండేందుకు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దారు డి.శ్రీరామకృష్ణ కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం నందు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను అనుసరించి పోలింగ్ నిర్వహించామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండేందుకు గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఊరేగింపులు, ర్యాలీలకు ఎలాంటి అనుమతులు లేవని, ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పండుటాకులు.. పడిగాపులు

సత్తెనపల్లి: సామాజిక భద్రత పింఛను పంపిణీలో లబ్ధిదారులుకు మళ్లీ ఇబ్బందులు తప్పలేదు. జూన్ నెలకు సంబంధించిన పింఛను సొమ్ము బ్యాంకుల్లో జమ చేయడంతో.. ఆ నగదు తీసుకునేందుకు వృద్ధులు బ్యాంకులకు చేరుకున్నారు. పట్టణంలోని పలు బ్యాంకుల వద్ద వృద్ధులు శనివారం ఇబ్బందులకు గురయ్యారు. ఎండలు మండిపోతుండడంతో ఉక్కపోతతో గంటలు తరబడి నిలబడలేక నానా అవస్థలు పడ్డారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

క్రోసూరు: యువ న్యాయవాది సంపత్ కుమార్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ ఎస్టీ విజిన్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూపురంలోని షెడ్యూల్ కులానికి చెందిన యువ న్యాయవాది సంపత్ కుమార్‌ను మరో న్యాయవాది కృష్ణారెడ్డి స్థల వివాదం నేపథ్యంలో కిడ్నాప్ చేసి, హత్య చేసి చేసినట్లు చెప్పారు. మృత దేహాన్ని ధర్మవరం చెరువు కట్ట పక్కన పడవేసారని ఆరోపించారు. హంతకులు కృష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జున, వారి అనుచరుల ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, దోషులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురు అరెస్ట్

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలను తెనాలి ఎస్‌ఈబీ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం వెల్లడించారు. పట్టణ మారిస్‌పేట స్వతంత్ర విహార్ హోటల్ సమీపంలో 96 మద్యం క్వార్టరు సీసాలను తరలిస్తూ ముగ్గురు యువకులు ఎస్‌ఈబీ అధికారులకు చిక్కారు. పరిమితికి మించి తీసుకెళుతుండడంతో వారిని ప్రశ్నించగా మద్యం దుకాణంలోని సేల్స్‌మ్యాన్ సహకరించినట్టు తెలిపారు.

వాణిజ్య సంస్థలు బంద్ చేయాలి



ఎస్‌ఐ
ఎస్.కోటయ్య

దుర్గి: ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో నేటి నుంచి ఈ నెల 5 వరకు వ్యాపార దుకాణాలు, ఇతర సభలు, సమావేశాలు నిర్వహించరాదని శనివారం ఎస్‌ఐ ఎస్.కోటయ్య తెలిపారు. శాంతిభద్రతల పరిక్షణకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ర్యాలీలు, ఊరేగింపులు పూర్తిగా నిషేధమని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఆయా పార్టీల నాయకులు తమకు సహకరించాలని కోరారు. సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో శాంతి భద్రతల రక్షణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే పీడీ యాక్టు, రౌడీ షీటు ఓపెన్ చేసి జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుర్గి, గ్రామాల్లో నిత్యావసర వస్తువుల దుకాణాలు మినహా.. ఇతర వాణిజ్య దుకాణాలు తెరవకూడదని స్పష్టం చేశారు.

లెక్కింపునకు అందరూ సహకరించాలి

- తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య
- ఈ నెల 6 వరకు వ్యాపార సంస్థలు మూతవేయాలి



సదస్సులో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ఓట్లు లెక్కింపు సందర్భంగా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు అన్నీ గ్రామాల్లో నేటి నుంచి 6వ తేదీ వరకు వ్యాపార సంస్థలు అన్నీ మూసి వేయాలన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని తద్వారా ఓట్ల లెక్కింపు పురస్కరించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ప్రజలందరు తమ వంతు సహకరించాలన్నారు. అత్యవసరమైన పాలు, పెరుగు, కూరగాయలు, మెడికల్ దుకాణాలు మినహాయించి మిగిలిన వ్యాపార సముదాయాలన్నీ పూర్తిస్థాయిలో మూత వేయాలన్నారు. రోడ్లపై ప్రజలు గుంపులుగా ఉండరాదన్నారు. ఎస్సై చల్లా సురేష్ మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తి కాగానే బాణా సంచా టపాసులు తదితరవన్నీ కాల్చరాదన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వీడియోలు, ఫోటోలు, సందేశాలు పోస్టులు చేసిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆమెతోపాటు ఎంపీడీవో కొత్రపాటి కవితా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ, జనుము విత్తనాలు



ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఆయా రైతు భరోసా కేంద్రాలకు వచ్చినట్లయితే సిబ్బంది వారికి విత్తనాలు అందజేస్తారని వ్యవసాయ శాఖ అధికారి రామారావు తెలిపారు.

ఈపూరు : వ్యవసాయ సీజన్ త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇందులో భాగంగా మొదటి దశగా పచ్చిరొట్ట విత్తనాలు ఆయా రైతు భరోసా కేంద్రాలకు చేరినట్లు మండల వ్యవసాయాధికారి రామారావు శనివారం తెలిపారు. జీలుగ 77 క్వింటాళ్లు, జనుము 87 క్వింటాళ్లు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్నాయని, ఈ అవకాశాన్ని అందరూ రైతులు వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. కావాల్సిన వారు పట్టాదారు పాస్‌పుస్తకం,

176 మద్యం బాటిళ్లు స్వాధీనం



దాచేపల్లి: నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో ఏలూరి అనిల్‌కుమార్ అనే వ్యక్తి అక్రమంగా నిల్వ చేసిన రూ.10,400 విలువ చేసే 80 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎ.సురేంద్రబాబు శనివారం తెలిపారు. అలాగే మండలంలోని పొందుగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగ దండిగ శంకరయ్య అనే వ్యక్తి కారులో అక్రమంగా తరలిస్తున్న రూ.8,640 విలువ చేసే 96 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరినట్లు సీఐ చెప్పారు. ఎస్‌ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి ఉన్నారు.

127 మద్యం సీసాలు స్వాధీనం

పిడుగురాళ్ల: మండలంలోని కరాలపాడు గ్రామంలో అక్రమంగా ఉన్న 127 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ పఠాన్ రబ్బానీఖాన్ తెలిపారు. కరాలపాడు గ్రామంలో ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి వద్ద 127 మద్యం క్వాటర్ బాటిళ్లను మరో వ్యక్తికి విక్రయిస్తుండటంతో వారిద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తొంభై శాతం పెన్షన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో శనివారం వైఎస్సార్ పెన్షన కానుక–సామాజిక భద్రతా పెన్షన్లు సచివాలయ సిబ్బంది 90 శాతం పంపిణీ చేశారు. మండలంలో 9659 మంది లబ్ధిదారులకు గాను రూ.2,86,49, 000లు పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో 2440 మందికి గాను పెన్షన్ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. మిగిలిన 7219 మందికి సచివాలయ సిబ్బంది ఉదయం నుండి పంపిణీ చేశారు. సుమారు 80 శాతం పైగా పంపిణీ పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

దోమల నివారణతోనే మలేరియా దూరం

మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌రెడ్డి



మలేరియా మాసోత్సవాల ర్యాలీలో మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌రెడ్డి, అధికారులు

రెంటచింతల: నివాస పరిసర ప్రాంతాల్లో దోమల నివారణతోనే మలేరియాను దూరం చేయవచ్చునని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహించనున్న మలేరియా మాసోత్సవాలను శనివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌రెడ్డి, అంకమ్మరావు మాట్లాడారు. వర్షాలకు నివాసం లోపల, పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దోమల కారణంగా ఫైలేరియా, చికున్ గున్యా, డెంగీ, మెదడువాపు తదితర వ్యాధులు వ్యాపిస్తాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా దోమ తెరలను, కిటికీలకు మెష్‌లను వాడాలని సూచించారు. పాత టైర్లు, కొబ్బరి బొండాలు ఊరికి దూరంగా పడవేయాలని చెప్పారు. ప్రతి శుక్రవాం ఖచ్చితంగా డ్రై డేగా పాటించాలని కోరారు. జ్వరం వచ్చినప్పుడు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, అసిస్టెంట్లు మహేష్ బాబు, కాశిం, సీతారామిరెడ్డి, ఆరోగ్య కార్యకర్త విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌంటింగ్ అనంతరం ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం



అఖిల పక్ష సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దుర్గి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడాలని శనివారం రాజకీయ పార్టీల నాయకులకు తహసీల్దారు రజనీకుమారి కోరారు. ఈ మేరకు ఆమె అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఈసీ నియమించిన డీఎస్పీలు, సిఐలు అధ్యక్షత వహించి, మాట్లాడారు. ఎన్నికల ఫలితాల అనంతరం మండల పరిధిలో ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపు నిషేధమని, గుమికూడి జనం ఉండరాదని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా కఠినంగా శిక్షిస్తామన్నారు. ఎన్నికల ముందు జరిగిన అల్లర్ల నేపథ్యంలో ప్రత్యేక కేంద్ర బలగాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సహకరించి శాంతిభద్రతలకు కృషి చేయాలన్నారు. ప్రజలు గ్రామాలలో ఉండాలన్నారు. పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ, టీడీపి, జనసేన నాయకులు హాజరయ్యారు. గతంలో అల్లర్లకు పాల్పడిన వారి సమాచారాన్ని సేకరించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాలలో ముందుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేసి శాంతిభద్రతలను అదుపులో ఉంచామన్నారు. ఎవరైనా కొత్తవారు సంచరిస్తే తమకు, స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారాన్ని అందజేయాలన్నారు. ఈ సమావేశంలో రెవిన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

క్షణికావేశమొద్దు.. సహకరించండి

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజు మంగళవారం మండల ప్రజలు అధికారులకు సహకరించాలని తహసీల్దారు రామ్మోహన్‌రావు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులకు, మండల స్థాయి అధికారులకు సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సమయం , తదుపరి గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా రాజకీయ పార్టీల నాయకులు పూర్తిగా అధికారులకు సహకరించాలని కోరారు. చిన్న చిన్న విషయాలకు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కటుంబం చిన్నాభిన్నం అవుతుందనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ఏ చిన్న తప్పు చేసినా బైండోవర్ కేసు నమోదు చేసి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తారని హెచ్చరించారు. ఈ నెల 5వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు పి.బ్రహ్మయ్య, ఆర్‌ఐ దాసరి కాంతారావు, పలు రాజకీయ పార్టీల నాకులు పాల్గొన్నారు.

కూలీలకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



మునుగోడులో కూలీలతో మాట్లాడుతున్న రవిబాబు

అమరావతి: ఉపాధి హామీ పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్లు ఉండే విధంగా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి రవిబాబు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మునుగోడులో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స బాక్సులు ఉండటం లేదన్నారు. ఐదు వారాల వేతనాలు రావాల్సి ఉందని, పెండింగ్ వేతనాలు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పని దినాలు 200లకు పెంపుతో పాటుగా ఇతర డిమాండ్లను సాధించుకోవడానికి కూలీలందరూ ఐక్యమత్యంతో కృషి చేయాలని కోరారు. వంద రోజులు పూర్తి చేసిన ప్రతి ఉపాధి హామీ కూలీకి కావాల్సిన గడ్డపలుగు, పారలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సయ్యద్ మొహిద్దీన్, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మున్సిపల్ కమిషనరు చింతా రవిచంద్రారెడ్డి



పారిశుధ్యంపై సూచనలు చేస్తున్న కమిషనరు

నరసరావుపేట: పట్టణంలోని విధుల్లో పారిశుధ్యంపై సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేయాలని మున్సిపల్ కమిషనరు చింతా రవిచంద్రా రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 25వార్డు పెద్ద చెరువు, 32వ వార్డు బరంపేట సీసాల బజారు, మిట్టబజార్ పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. వీధుల్లో పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు పరిసర ప్రాంతాల్లో పాదచారులు, వాహనదారులకు పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను అడ్డంలేకుండా తొలగించాలన్నారు. డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్ ప్రతిరోజు చేసే విధంగా, కాలువలు శుభ్రంగా ఉండేవిధంగా చేసుకోవాలని కోరారు. కాలువలు శుభ్రం చేయడంలో వాటిపై ఏ విధమైన ఆక్రమణలు ఉన్నా సంబంధిత టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌కు తెలియచేస్తే వారు వాటిని తొలగిస్తారన్నారు. కనుక ప్రతి ఒక్కరు వార్డులోని సమస్యలను నోట్ చేసుకొని సంబంధిత టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రతి సెక్రటరీ తమ వార్డులో చేసేటటువంటి పనులకు సంబంధించి బిఫోర్, ఆఫ్టర్ ఫోటోలు తీసి పంపించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాములు నాయక్, శానిటేషన్ ఇనస్పెక్టర్లు రామకోటయ్య, వెంకటేశ్వర్లు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

నాదెండ్ల: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని నాదెండ్ల శాఖా గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను పురస్కరించుకుని శనివారం నూతన పుస్తకాల పరిచయం నిర్వహించారు. చిన్నారులకు పలు రకాల కథల పుస్తకాలు, సైన్స్, గణితం, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందించి అందులోని విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలతో పాటూ గ్రంథాలయాల్లోని విషయజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను చదవాలని కోరారు.